సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 27 । జనవరి । 2023



టన్ను చీనీ రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.30 వేల ధర పలికాయి. 34 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.16

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.10 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

31.8°/12.5°

జిల్లాలో గురువారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వలంగా పెరిగాయి. గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.



జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, చిత్రంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్



సర్వమతాల సారం ఒక్కటే అని చాటుతూ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

జెండా.. మదినిండా



ఘనంగా గణతంత్ర వేడుకలు

- ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల వద్ద రెపరెపలాడిన త్రివర్ణపతాకం
- శిరసాని హిల్స్‌లో అంబరమంటిన సంబరాలు
- పతాకావిష్కరణకు తరలివచ్చిన ప్రజాప్రతినిధులు
- సాంస్కృతిక కార్యక్రమాలతో స్వాతంత్ర్య ఘట్టాలను కళ్లకు కట్టిన విద్యార్థులు
- సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించిన కలెక్టర్
- అన్నింటా జిల్లాను ప్రథమ స్థానంలో నిలపుదామని పిలుపు

ముష్వన్నెల జెండా మురిసింది. ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావం వెల్లివిరిసింది. 74వ గణతంత్ర వేడుకలు జిల్లాలో గురువారం అంగరంగ వైభవంగా సాగాయి. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల వద్ద త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. జిల్లావాసులు జెండాను చేతబట్టి గణతంత్ర స్ఫూర్తిని చాటారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పతాకాన్ని ఎగురవేశారు.

సాక్షి, పుట్టపర్తి: పుట్టపర్తి సమీపంలోని శిరసాని హిల్స్ వేదికగా గణతంత్ర వేడుకలు అంబరమంటాయి. ఉదయం 8:55 గంటలకు ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్‌తో కలిసి కలెక్టర్ బసంత్ కుమార్ పతాకావిష్కరణ చేసి సెల్యూట్ చేశారు. జాతీయ గీతాలాపన అనంతరం పరేడ్ వీక్షించారు. సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రసంగించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.



రైతుల స్థితిగతులపై సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న డైట్ విద్యార్థులు

గ్రామ స్వరాజ్యం సాకారం



ప్రసంగిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ఆవిష్కరించాలనే సంకల్పంతో గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ, గ్రామ/వార్డు వలంటీర్ల వ్యవస్థకు సీఎం శ్రీకారం చుట్టారని, ఆయన ఆశయాలకనుగుణంగా పనిచేసి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం కింద అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్లు మంజూరు చేశామన్నారు. 'ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన కింద రూ.4.17 కోట్లతో 31 పనులు చేపట్టగా 8 పనులు పూర్తయ్యాయి. గ్రామస్థాయిలో 416 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశాం. రైతుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తున్నాం. మహిళా – శిశు సంక్షేమంలో భాగంగా 2,824 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ ఏడాది 1,25,166 మందికి పౌష్టికాహారం అందించాం. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా 25 వేల మంది బాలింతలు, గర్భిణులు టేక్ హోం రేషన్ పొందుతున్నారు. జగనన్న పచ్చతోరణం కార్యక్రమం ద్వారా 1,098 రైతులకు చెందిన 2,904 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టనున్నాం. అటవీ శాఖ ద్వారా 580 హెక్టార్లలో మొక్కలు నాటుతాం. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ తరఫున రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటుతాం. వరుణుడి కరుణతో జిల్లాలో 5.31 మీటర్ల మేర భూగర్భ జలమట్టం పెరిగింది. వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఈ ఏడాది జిల్లాలో 2,68,904 కుటుంబాలకు రెండు విడుతలుగా రూ.308.18 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశాం. మన బడి, నాడు–నేడు కార్యక్రమం కింద కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నాం. జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌లో భాగంగా ఒక్కో నియోజకవర్గంలో ఒక టౌన్ షిప్ ను ఏర్పాటు చేస్తున్నాం. 'అమృత్ సరోవర్ పథకం' కింద జిల్లాలో 99 చెరువులను అభివృద్ధి చేసేందుకు రూ.311.13 కోట్లతో పనులు చేపట్టాం. సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.12.39 కోట్లతో 6,846 మంది రైతులకు నూతన పండ్ల తోటల విస్తరణ, రక్షిత సేద్యం, ఫారం పాండ్స్ తదితర ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. పట్టు పరిశ్రమ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.12.43 కోట్లు ఖర్చు చేశాం. జిల్లాలో ఇప్పటివరకు 48 భారీ, మెగా పరిశ్రమలు రూ.16,456 కోట్లతో ప్రారంభమయ్యాయి. మరో 132 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను రూ.14.22 కోట్ల పెట్టుబడితో మొదలయ్యాయి. నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్ చొప్పున జిల్లాలో 6 స్కిల్ హబ్‌లను ప్రారంభించాం.' అని కలెక్టర్ వివరించారు.

ఆకట్టుకున్న శకటాలు.. సాంస్కృతిక ప్రదర్శనలు

వేడుకల్లో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. నూతనంగా ఏర్పడిన జిల్లాలో మొదటి సారిగా వేడుకలు నిర్వహిస్తుండడంతో అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. పోలీసు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్ నలువైపులా జాతీయ జెండాల చిత్రాలు, వివిధ రకాల జెండాలు ఏర్పాటు చేయడంతో వైభవం ఉట్టిపడింది. పోలీసు జాగిలాలు చేసిన విన్యాసాలు ఔరా అనిపించాయి. ఏఆర్ పోలీస్ సిబ్బంది మార్చ్‌ఫాస్టు అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ధర్మవరం నాట్యకళానికేతన్ విద్యార్థులు ప్రదర్శించిన జయహో నా భూమి అనే దేశభక్తి గేయం, కేజీబీవీ విద్యార్థుల పాడవోయి భారతీయుడా ఎంతగానో అలరించింది. బుక్కపట్నం డైట్ విద్యార్థులు.. రైతుల బాధలపై చూడ చక్కని తల్లి అనే జానపద గేయం అద్భుతంగా ప్రదర్శించారు. సాంస్కృతిక ప్రదర్శనలు సాగినంత సేపు ప్రాంగణం కరతాళధ్వనులతో ప్రతిధ్వనించింది. అద్భుత అభినయంతో ఆకట్టుకున్న చిన్నారులను జిల్లా అధికారులు అభినందించి బహుమతులందజేశారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



జయహో నా భూమి దేశభక్తి గేయానికి సాంస్కృతిక ప్రదర్శన



సాంస్కృతిక ప్రదర్శనలిచ్చిన విద్యార్థులతో కలెక్టర్, ఎస్పీ తదితరులు



దిశ ద్విచక్రవాహనాలను ప్రదర్శిస్తున్న మహిళా పోలీసులు



గణతంత్ర వేడుకలకు హాజరైన పురప్రముఖులు

న్యూస్‌రీల్

రేపు సూర్య ప్రభ వాహనంపై శ్రీవారి ఊరేగింపు

కదిరి టౌన్: రథసప్తమి సందర్భంగా శనివారం ఉదయం 6 గంటల నుంచి ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారు సూర్య ప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే, ఈ నెల 30న మాఘమాసం మధ్యనవమి సందర్భంగా స్వామి వారు హనుమంత వాహనంపై సాయంత్రం 5.30 గంటల నుంచి తిరువీధుల్లో విహరించనున్నారు. భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, చైర్మన్ గోపాలకృష్ణ కోరారు.

జిల్లా హాకీ జట్టు ఎంపిక

ధర్మవరం: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా హాకీ జట్టు ఎంపికను స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం నిర్వహించారు. ఫిబ్రవరి 3,4 తేదీల్లో కాకినాడలో జరగనున్న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి హాకీ లీగ్ టోర్నమెంట్‌లో ఈ జట్టు పాల్గొననుందని జిల్లా ముఖ్య శిక్షకుడు జగన్నాథ్‌రెడ్డి తెలిపారు. జిల్లా జట్టుకు వెంకటేష్‌నాయక్, మహమ్మద్‌రఫి, నవీన్‌కుమార్, బాల ఓబులేసు, లోకేష్, ఈశ్వర్, మహమ్మద్‌బాష, జగన్, ప్రశాంత్, దుర్గ, ఎం.లోకేష్, చరణ్‌తేజ, సుధాకర్‌బాబు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా హాకీ కోచ్ హుసేన్, అనంతపురం జిల్లా హాకీ కోచ్ చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- రూ.2.02 కోట్లతో సబ్‌స్టేషన్ పనులకు భూమి పూజ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

బత్తలపల్లి: రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో నూతనంగా రూ.2.02 కోట్లతో ఏర్పాటు చేయనున్న 33/11 సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రైతులకు కోతలు లేని విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. బత్తలపల్లి మండలంలో తంబాపురం, లింగారెడ్డిపల్లికి సబ్‌స్టేషన్లు తీసుకొచ్చినట్లు వివరించారు. రూ.150 నుంచి 200 కోట్లు వెచ్చించి హెచ్‌డీఎఫ్‌సీ ద్వారా 15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లు, 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను నియోజకవర్గ వ్యాప్తంగా ఏర్పాటు చేశామన్నారు. రూ.100 కోట్లకు పైగా విలువైన పనులు చేపట్టినట్లు వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఆర్బీకేల ఏర్పాటు, పండించిన పంటకు మద్దతు ధర, వ్యవసాయంలో అనుసరించాల్సిన పద్ధతులు తెలియజేసేందుకు ఆర్బీకేల్లో వ్యవసాయ సహాయకులను నియమించారన్నారు. ఉచితంగా విద్యుత్ అందిస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని ఉచితంగా అందించిన దాతలు వెంకటరంగారెడ్డి, ఉపేంద్రరెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో అనంతపురం ఎస్‌ఈ (ఆపరేషన్స్) సురేంద్ర, ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి, డీఈ రమేష్, కన్‌స్ట్రక్షన్ ఈఈ మోహనమ్మ, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ కోటి సుధ, సర్పంచు శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొర్రకోడులో పర్యటించిన కేంద్ర బృందం

కూడేరు: కేంద్ర బృందం సభ్యులు సంతోష్ ప్రధాన్, ప్రదీప్‌పై క్రాయ్ గురువారం కొర్రకోడులో పర్యటించారు. ఉపాధి పథకం ద్వారా చేసిన కాలువలో పూడికతీత పనులను పరిశీలించారు. ఉపాధి పనులు సక్రమంగా కల్పిస్తున్నారా? అని ఆరా తీశారు. అలాగే చెత్తతో సంపద తయారీ కేంద్రం, పక్కా ఇళ్ల నిర్మాణం పనులు, హార్టికల్చర్ ద్వారా సాగు చేసిన మామిడి మొక్కలు పరిశీలించారు. తర్వాత ఉదిరిపికొండలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. లబ్ధిదారులతో పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, ఎంపీడీఓ ఎంకే బాషా, ఏపీఓ తులసీ ప్రసాద్‌తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చింతపండు క్రయవిక్రయాల ప్రారంభం

- మొదటి రోజు వెయ్యి క్వింటాళ్ల రాక



చింతపండును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

హిందూపురం: హిందూపురం మార్కెట్‌యార్డులో గురువారం చింతపండు క్రయవిక్రయాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మొదటి రోజే 10 లారీల్లో వెయ్యి టన్నుల చింతపండు రావడం శుభపరిణామమన్నారు. అన్ని ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవడంతో చింతపండు కాపు బాగా వచ్చిందన్నారు. ఆశించిన ధరలు పలికి రైతుల కుటుంబాల్లో వెలుగులు నిండుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం యార్డులో రైతులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో యార్డు అధికారులు, వ్యాపారులు శ్రీకాంత్, ఫైరోజ్ అహమ్మద్, దీపక్, శ్యాంబాబు, నిఖిల్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

యార్డులో చింతపండు రేట్లు ఇలా..

కరీపులీ రకం: క్వింటాల్ కనిష్టం రూ. 13వేలు, గరిష్టం రూ.30వేలు.

ఫ్లవర్ రకం: క్వింటాల్ కనిష్టం రూ. 3వేలు, గరిష్టం రూ.9వేలు.

బోటు రకం : క్వింటాల్ రూ. 2,500.

ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో తాడిమర్రి విద్యార్థి



ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న గౌతమ్ దీపక్‌రెడ్డి

తాడిమర్రి: దేశ రాజధాని ఢిల్లీలో గురువారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో తాడిమర్రి విద్యార్థి పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన గంగులకుంట ఓబిరెడ్డి, చాముండేశ్వరి దంపతుల కుమారుడు గౌతమ్ దీపక్‌రెడ్డి అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో బీఎస్సీ (బయోటెక్నాలజీ) ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్‌లో (ఎన్‌సీసీ) చేరాడు. ఈ ఏడాది ద్వితీయ సంవత్సరంలో ఎన్‌సీసీ నిర్వహించే క్యాంపుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పరేడ్ క్యాంపునకు ఎంపికయ్యాడు. దేశ రాజధానిలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, స్పోర్ట్స్ డైరెక్టరేట్ ఆఫ్ నేషనల్ సర్వీసెస్ స్కీమ్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నాడు. నిర్వాహకులు గౌతమ్‌దీపక్ రెడ్డికి మెమొంటోలు, ప్రశంసా పత్రం అందించి అభినందించారు.

ప్రజా సేవకు పునరంకితం



జాతీయ జెండాకు వందన సమర్పణ చేస్తున్న డీఐజీ రవిప్రకాష్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: గణతంత్ర దినోత్సవ స్ఫూర్తితో ప్రజాసేవకు పునరంకితమవుదామని డీఐజీ రవిప్రకాష్ పిలుపునిచ్చారు. అనంతపురం రేంజ్ కార్యాలయ ఆవరణలో గురువారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను డీఐజీ రవిప్రకాష్ ఆవిష్కరించి, వందన సమర్పణ చేశారు. జిల్లా ప్రజలకు, పోలీసులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, డీఐజీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో అదనపు ఎస్పీ నాగేంద్రుడు ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఆకట్టుకున్న ప్రగతి రథాలు

జగన్ సర్కార్ అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు ఉట్టిపడేలే గణతంత్ర దినోత్సవంలో వివిధ శాఖలు ప్రదర్శించిన ప్రగతి రథాలు (శకటాలు) విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రధానంగా 12 శాఖల శకటాలు ప్రదర్శించగా ఇందులో హౌసింగ్ శాఖకు మొదటి స్థానం, వ్యవసాయశాఖకు రెండో స్థానం, జిల్లా పంచాయతీ శాఖ (డీపీఓ)కు తృతీయ స్థానం దక్కాయి. ఉత్తమ ప్రదర్శనకు గాను హౌసింగ్ శాఖ పీడీ చంద్రమౌళిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీపీఓ విజయ్‌కుమార్‌కు ప్రశంసాపత్రాలు అందజేశారు. - పుట్టపర్తి అర్బన్


ప్రథమ స్థానాన్ని దక్కించుకున్న గృహనిర్మాణ శాఖ శకటం


రెండో స్థానంలో నిలిచిన వ్యవసాయశాఖ శకటం


మూడో స్థానాన్ని దక్కించుకున్న డీపీఓ శకటం

ఉత్తమ పనితీరుకు అవార్డు

ప్రశంసాపత్రాలు అందజేసిన కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రదానం చేశారు. వీరందరూ కలెక్టర్ బసంతకుమార్ చేతుల మీదుగా గురువారం పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో ప్రశంసాపత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్, డీఆర్వో కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డి పాల్గొన్నారు.


కలెక్టర్ బసంత్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్


తిప్పేనాయక్, ధర్మవరం, ఆర్డీఓ; భవ్య కిషోర్, కదిరి డీఎస్పీ; శుభదాస్, పశుసంవర్థక శాఖ జిల్లాధికారి; రవీంద్రనాథరెడ్డి, అటవీశాఖ జిల్లా అధికారి; శ్యామల, సామాజిక అటవీ శాఖాధికారి; పద్మమ్మ, పట్టు పరిశ్రమ శాఖాధికారి; రోహిల్, హిందూపురం ఆస్పత్రి సూపరింటెండెంట్; రామాంజినేయులు, డ్వామా పీడీ; నిర్మల జ్యోతి, బీసీ కార్పొరేషన్ అధికారి; చంద్రమౌళిరెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ; ఎంఎల్ఎన్ మూర్తి, మార్కెటింగ్ శాఖ ఏడీ


సుందర మోహన్‌రెడ్డి, తెలుగు లెక్చరర్, కదిరి; కేవీఆర్‌కే ప్రసాద్, జిల్లా సెబ్ అధికారి; కృష్ణకుమారి, జిల్లా రిజిస్ట్రార్; విజయ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి; జగన్నాథరెడ్డి, స్పోర్ట్స్ చీఫ్ కోచ్; కృష్ణా నాయక్, జిల్లా సహకార అధికారి; వెంకటేశ్వరరావు, హిందూపురం మున్సిపల్ కమిషనర్; హరిబాబు, కదిరి మున్సిపల్ కమిషనర్; నాగాంజనరెడ్డి, జలజీవన్ మిషన్ డీపీఎం; వెంకటేశ్వర్లు, సోమందేపల్లి కెనరా బ్యాంక్ మేనేజర్; కిరణ్ కుమార్, యూబీఐ బ్యాంక్ కదిరి బీఎం


కేశవులు, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్; సూర్యనారాయణ, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్; జబీవుల్లా ఖాన్, లేపాక్షి ఏపీజీబీ మేనేజర్; ఖతిజెన్ కుబ్రా, ధర్మవరం ఆర్డీఓ కార్యాలయ ఏఓ; సెల్వియా సులొమన్, ఫ్యామిలీ ఫిజిషియన్ నోడల్ ఆఫీసర్; డాక్టర్ ఆయేషా దుర్దనా, సివిల్ అసిస్టెంట్ సర్జన్; మహమ్మద్ సాదిక్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్; మురళీధర్ నాయుడు, ఫైర్ సూపరింటెండెంట్; మజ్జిగ రామాంజనేయులు, ఫైర్‌మెన్; ఎం.హరిత, భూగర్భ జల వనరుల శాఖ; కెపి తిప్పేస్వామి, భూగర్భ జల వనరుల శాఖ; రాజేశ్వరి, చేనేత, జౌళి శాఖ; సింగం కవిత, మత్స్యశాఖ సహాయకురాలు; ఓం ప్రకాష్, బాక్సింగ్ కోచ్; కె.రాధిక, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్; సి.వెంకటరమణ, ఎంపీడీఓ, హిందూపురం; ఎస్.లక్ష్మీదుర్గయ్య, సెబ్ సిఐ హిందూపురం; నందకుమార్, సెబ్ కానిస్టేబుల్ పుట్టపర్తి; కె.ఉమామహేశ్వర్ ఐసీడీఎస్ కార్యాలయ సూపరింటెండెంట్


కె.వెంకప్ప, ప్లాంటేషన్ మేనేజర్, డ్వామా; జీహెచ్ ఆంజనేయులు డ్వామా ఆఫీస్; వేమారెడ్డి, ఉద్యాన శాఖ పుట్టపర్తి; కోమల నాగవేణి, విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్; ప్రతాప్ రెడ్డి, టూరిజం శాఖ; గాజుల లక్ష్మీదేవి, డిప్యూటీ తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయం; జి.నాగరాజు, తహసీల్దార్, చిలమత్తూరు; ఇమ్రాన్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్; ఎ.రజితకుమారి, సీనియర్ అసిస్టెంట్ అమరాపురం; షాషావలి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, రొద్దం; శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్, సబ్ కలెక్టరేట్; అనూజ, ఆఫీస్ సబార్డినేట్ చిలమత్తూరు; నరసింహమూర్తి, వీఆర్వో, అగళి; చిట్టిబాబు, డీఐఓఎస్, సబ్ కలెక్టరేట్


అశ్వత్థనారాయణ, విలేజ్ సర్వేయర్, లేపాక్షి; క్రాంతి కుమార్, తహసీల్దార్, తలుపుల; యు.సునీత, డిప్యూటీ తహసీల్దార్, కదిరి; విజయకుమారి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే; ఈశ్వరయ్య, ఆర్ఐ, అమడగూరు; నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్, తనకల్లు; సాయివర్ధన్, వీఆర్ఓ, తలుపుల; నిరంజన్ రెడ్డి, సీఐ నల్లమాడ; వెంకటేశ్వర్లు, టూటౌన్ సీఐ హిందూపురం; సురేష్‌బాబు, సీఐ, మడకశిర; జయానాయక్, సీఐ, పుట్టపర్తి రూరల్; నరసింహులు, ఎస్ఐ, బుక్కపట్నం; శ్రీనివాసులు, ఎస్ఐ, చిలమత్తూరు; హేమంత్ కుమార్, ఎస్ఐ, ముదిగుబ్బ


వెంకటరమణ, ఎస్ఐ, కియా పోలీస్ స్టేషన్; వెంకటేశ్వర్లు, ఎస్ఐ, అమరాపురం; రాంభూపాల్, ఎస్ఐ, తనకల్లు; హరూన్ బాషా, ఎస్ఐ, డీసీఆర్‌బీ; లక్ష్మీనారాయణ, ఎస్ఐ, తాడిమర్రి; వెంకటేశ్వర్ రావు, ఎస్ఐ, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్; నాగరాజు, ఏఎస్ఐ, డీపీఓ; శ్రీనివాసకుమార్, ఏఎస్ఐ, క్రైంబ్యూరో; కృష్ణానాయక్, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏఎస్ఐ; వై.శివశంకర్ రాజు, హెడ్ కానిస్టేబుల్, హిందూపురం; రెడ్డెప్ప, హెచ్‌సీ క్రైం రికార్డ్ బ్యూరో

జిల్లా పోలీస్ కార్యాలయంలో 'గణతంత్రం'

పుట్టపర్తి అర్బన్: ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఉదయం 8 గంటలకు జాతీయ పతాకాన్ని ఎగురవేసి జిల్లా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు ఏఆర్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ రామకృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఉమామహేశ్వరరెడ్డి, విజయ్‌కుమార్, ఆర్ఐ శ్రీశైలంరెడ్డి, ఆర్ఎస్ఐ చంద్రశేఖర్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


జెండా వందనం చేస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్

జాతీయ సమైక్యతను పెంపొందించుకోవాలి : కలెక్టర్

పుట్టపర్తి టౌన్: సమాజంలో ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యతను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ బసంత్‌కుమార్ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం సాయి ఆరామంలో నిర్వహించిన జాతీయ సమైక్యత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ చాటుకున్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఐక్యమత్యంతోనే ప్రగతి సాధ్యమవుతుందన్నారు. ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్, డీఆర్‌ఓ కొండయ్య, ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ నవీన్‌కుమార్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

వివాహిత బలవన్మరణం

ధర్మవరం రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరం మండలం ఓబుళనాయనిపల్లి తండాకు చెందిన శోభారాణి బాయి (36), దుబ్లానాయక్ దంపతులు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలం అంగన్‌వాడీ ఆయాగా పనిచేసిన శోభారాణి.. అనంతరం ఆ పనిని మానేసి భర్తకు తోడుగా వ్యవసాయ పనుల్లో పాల్గొంటూ వస్తోంది. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను గమనించిన కుటుంబసభ్యులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా, కుటుంబకలహాల నేపథ్యంలో ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వలస కూలీ మృతి

కదిరి అర్బన్: పని ప్రాంతంలో చోటు చేసుకున్న ప్రమాదంలో వలస కూలీ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి పారిశ్రామిక వాడలోని గుజరీ దుకాణంలో బీహార్‌కు చెందిన షరీఫ్ (30) కూలీగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం ప్లాస్టిక్‌ను ముక్కలు చేసే యంత్రం వద్ద పనిచేస్తుండగా ఒక్కసారిగా యంత్రంలో పేలుడు చోటు చేసుకుంది. ఘటనలో షరీఫ్‌తో పాటు నేపాల్‌కు చెందిన శ్రీరామ్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే కదిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో షరీఫ్‌ను అనంతపురంలోని వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రాణాలు బలిగొన్న అతి వేగం

- ద్విచక్ర వాహన చోదకులను ఢీకొన్న ఐచర్
- ఒకరి దుర్మరణం
- ఆస్పత్రికి తరలిస్తుండగా మరొకరి మృతి
- సోమందేపల్లిలో విషాదం


తరుణ్ (ఫైల్),


బెంగళూరుకు తరలిస్తుండగా మృతి చెందిన సాయి

పెనుకొండ: అతి వేగం ఇద్దరి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... సోమందేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, స్థానిక గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు గూడూరు రమేష్ చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. తాను నేసిన పట్టు చీరలను ప్రతి గురువారం ధర్మవరంలోని దుకాణంలో ఇచ్చి వచ్చేవాడు. ఈ క్రమంలో రమేష్ కుమారుడు సాయి (24), సోమందేపల్లిలోని గాంధీ నగర్ నివాసి తరుణ్ (24)తోన కలసి ద్విచక్ర వాహనంపై గురువారం ఉదయం ధర్మవరానికి చేరుకుని పట్టుచీరలు ఇచ్చి మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. పెనుకొండ మండలం ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఓ వాహనాన్ని ఓవర్ టేక్ చేసి అతివేగంతో దూసుకొచ్చిన ఐచర్ ఢీకొంది. ఘటనలో తలకు బలమైన గాయమై తరుణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన గూడురు సాయిని స్థానికులు వెంటనే పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం హిందూపురం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. తరుణ్ తండ్రి కుళ్లాయప్ప ఇటీవల గుండెనొప్పితో మృతి చెందాడు. తల్లి అంజినమ్మతో పాటు తమ్ముడు అజయ్ ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

ఘనంగా రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ జయంతి

కంబదూరు: సంగీత, సాహిత్య విద్వాంసుకుడు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని రాళ్లపల్లిలో గురువారం రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ అసోసియేషన్ సభ్యులు, గ్రామపెద్దలు ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ కుటుంబీకులు శ్యామసుందర్, నందనందన్, రవీంద్ర, జితమన్యు, శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, సర్పంచ్‌లు అమర్, సాకే గంగాధర్, కవుల సంఘం జిల్లా అధ్యక్షుడు కంబదూరు షేక్ నబీరసూల్, కవి శేషాద్రి చంద్రశేఖర్‌శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.


రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తున్న కుటుంబీలు, నాయకులు

ఇన్నో ల్యాబ్ ప్రారంభం

అనంతపురం: అనంతపురం జేఎన్‌టీయూలో పూర్వ విద్యార్థులు (1979–83 బ్యాచ్) ఏర్పాటు చేసిన ఇన్నో ల్యాబ్‌ను విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య రంగజనార్దన గురువారం ప్రారంభించారు. ల్యాబ్ ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్/పీహెచ్‌డీ స్కాలర్స్ అకడమిక్ సపోర్ట్ చేయడానికి, పరిశోధకులు, అధ్యాపకుల శిక్షణకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ డాటా సైన్స్ అంశాలపై విద్యార్థులు, అధ్యాపకులకు శిక్షణ ఇస్తారన్నారు. పరిశ్రమల నమూనాలు, ఉత్పత్తులు, పరిష్కారాలు, అభివృద్ధి, వర్క్‌షాప్ వంటి అనేక అంశాలపై ఇక్కడ నిరంతరం సెమినార్లు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.